
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 9 । జూలై । 2025



సోమశిలలో 29.417 టీఎంసీలు

జలాశయంలో మంగళవారానికి 29.417 టీఎంసీలు ఉన్నాయి. పెన్నా డెల్టాకు 2,600, ఉత్తర, దక్షిణ కాలువలకు 825 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,920
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,033
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,304
నవర (8 గ్రాములు)	రూ.74,432

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /29.5

జిల్లాలో బుధవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. మంగళవారం గాలిలో తేమ 40 శాతం నమోదైంది

న్యూస్‌రీల్

కాకాణికి రెండు రోజుల పోలీస్ కస్టడీ



నెల్లూరు (లీగల్): కనుపూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించాలని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం రెండు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ నెల్లూరు 4వ అదనపు మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నిషాద్ నాజ్ షేక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని 9వ తేదీ ఉదయం 8 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి పోలీస్ కస్టడీకి తీసికోవాలని తిరిగి 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు అయనకు వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరు పరచాలన్నారు. థర్డ్ డిగ్రీ ఉపయోగించకూడదని ఉత్తర్వులో పేర్కొన్నారు. న్యాయవాది సమక్షంలో గోవర్ధన్ రెడ్డిని విచారణ జరపాలన్నారు. కాకాణిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని వెంకటాచలం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై పోలీసులు తరపున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ ఏడు రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరారు. కాకాణి తరపున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, మాలపాటి వెంకట విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్షతో కేసు పెట్టారని, పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డికి రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డీసీపల్లిలో 527 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం నాటికి 527 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 740 బేళ్లు రాగా 527 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. గరిష్టంగా కిలోకు రూ.280, కనిష్టంగా రూ.160 ధర లభించింది. సగటున రూ.202.37 ధర పలికింది. వేలంలో 10 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యతలేని పొగాకు తీసుకురావొద్దు

మర్రిపాడు: ప్రస్తుతం మార్కెట్‌లో మొద్దు మచ్చలు, రెండో నంబరు, సెలైన్, బొగ్గలు ఉన్నవి తప్ప మిగిలిన అన్ని రకాల పొగాకు అమ్ముడు పోతుందని, నాణ్యత లేని పొగాకును తీసుకు రావొద్దని డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కసారి అమ్ముడుపోని బేళ్లను తిరిగి అవే బేళ్లను వేలానికి తీసుకురావొద్దని, వాటి స్థానంలో వేరొక బేళ్లు కట్టి వేలానికి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. పొగాకు బేళ్లు వేలానికి తీసుకుని వచ్చేటప్పుడు 1వ నంబరు పొగాకు సగం, రెండో నంబరు పొగాకు సగం ఉండేటట్లు తీసుకురావాలని సూచించారు. మొత్తం రెండో నంబరు తీసుకుని వస్తే పోటీ లేకుండా ఎక్కువ నోబిడ్స్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

నేడు, రేపు రెవెన్యూ అసోసియేషన్ క్రీడలు

నెల్లూరురూరల్: 10వ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ క్రీడా పోటీలు ఈ నెల 9, 10 తేదీల్లో బుజబుజ నెల్లూరులోని క్రికెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంధ్ర స్టేడియంలో క్రికెట్ పోటీలు జరుగుతాయని మంగళవారం రెవెన్యూ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీ ఉదయం 8.45 గంటలకు కలెక్టర్ ఓ ఆనంద్ క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.

18న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (పొగతోట): ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా విద్యాశాఖ, విద్యుత్ శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. అధ్యక్షుల అనుమతితో ఇతర శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంలో రౌడీ రాజకీయం

- మాజీమంత్రి ప్రసన్న ఇంట్లో టీడీపీ గూండాల విధ్వంసం దేనికి సంకేతం
- లోకేశ్ వచ్చి వెళ్లిన గంటల వ్యవధిలోనే ఈ ఘటన
- ఇటీవల కూటమి ప్రభుత్వంపై ప్రసన్న ఘాటైన విమర్శలు
- విమర్శలు చేశారని కిరాయి మూకల అరాచకం
- బూతులు మాట్లాడుతూ చంపేస్తామంటూ రౌడీమూకలు వీరంగం
- హుందా రాజకీయాల నుంచి గూండాయిజం పై సర్వత్రా విమర్శలు
- ప్రశ్నించినా.. విమర్శలు చేసినా భౌతిక దాడులు, అక్రమ కేసులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు జిల్లా.. సుదీర్ఘ రాజకీయ చరిత్రకు, హుందా సంస్కృతికి పట్టం కట్టిన నేల. దశాబ్దాలుగా రాజకీయం అంటే హుందాతనానికి చిరునామాగా ఉండేది. అటువంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గూండాయిజం రాజకీయంగా మారిపోయింది. జిల్లాలో ఆనం, నల్లపరెడ్డి, నేదురుమల్లి, మేకపాటి వంటి కుటుంబాలు రాజకీయంగా విభిన్న అభిప్రాయాలతో ఉన్నా, వ్యక్తిగత విధ్వంసాలకు పాల్పడకుండా ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ముందుకు నడిచాయి. తమకంటూ వర్గాలను సొంతం చేసుకుని హుందా రాజకీయాలు నడిపించాయి. రాజకీయ క్షేత్రంలో ఎన్నెన్నో విమర్శలు చేసుకున్నప్పటికీ ప్రతి విమర్శలు కూడా అందుకునుగుణంగా సిద్ధాంత పరంగానే ఉండేవి. రాజకీయ ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది గానీ, ఇళ్లపై దాడులు, గూండాయిజం ఎన్నడూ చోటు చేసుకోలేదు. కూటమి పాలనలో రాజకీయాల స్వభావమే మారిపోయింది. ఈ మార్పు తాజాగా మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ గూండాల దాడిలో స్పష్టంగా కనిపిస్తోంది. లోకేశ్ పర్యటన ముగిశాక కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం రాజకీయ కుట్రగా వైఎస్సార్‌సీపీ నేతలు అభివర్ణిస్తున్నారు.

హుందా రాజకీయాలపై గూండాయిజం ముసురు

తాజాగా జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోయింది. రాజకీయంగా చేసిన విమర్శలపై అదే విధంగా తిప్పి కొట్టాల్సిన ప్రజాప్రతినిధులు సంయమనం కోల్పోతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై సోమవారం రాత్రి టీడీపీ కిరాయి గూండాలు సాగించిన విధ్వంసకాండ ఇందుకు అద్దం పడుతోంది. ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి పనులు చేశారు. అందులో ముదివర్తి– ముదివర్తిపాళెం కాజ్‌వేను సైతం ప్రసన్నకుమార్‌రెడ్డి పట్టుబట్టి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో కోవూరు ఎమ్మెల్యేగా గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల నియోజకవర్గ పర్యటనలో ముదివర్తి పాళెం కాజ్‌వేను తమ ప్రభుత్వం నిర్మిస్తుందంటూ తప్పుడు ప్రచారం చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు సైతం ఈ ప్రాజెక్ట్ మంజూరుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో సహా మీడియాకు చూపించి ఇది తమ ప్రభుత్వం సాధించిన ఘనత అయితే.. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అజ్ఞానంగా మాట్లాడాన్ని ఖండించారు. ఈ క్రమంలోనే సోమవారం కోవూరులోని ఓ కల్యాణ మండపంలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' సన్నాహక కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసన్నకుమార్ రెడ్డి తాను నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అవినీతికి పాల్పడలేదని, తనపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై విమర్శలు చేశారంటూ మండిపడ్డారు. నిఖార్సు అయిన రాజకీయాలు చేయాలే కానీ, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదంటూ ఘాటైన విమర్శలు చేశారు.



నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో టీడీపీ గూండాలు చేసిన దాడిలో ధ్వంసమైన ఫర్నీచర్ (ఫైల్)

చంపేస్తామంటూ రౌడీమూకలు వీరంగం

ప్రసన్నకుమార్‌రెడ్డి, తన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డితో కలిసి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల సమయంలో నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని ఆయన ఇంటికి సుమారు వంద మందికి పైగా రౌడీమూకలు మారణాయుధాలతో దౌర్జన్యంగా ప్రవేశించి విధ్వంసం సష్టించారు. ప్రసన్నకుమార్ రెడ్డి.. మా ఎమ్మెల్యే ప్రశాంతమ్మని విమర్శిస్తావా? నిన్ను చంపేస్తామంటూ పెద్ద పెద్దగా కేకలు వేస్తూ ఇళ్లంతా ధ్వంసం చేశారు. రౌడీమూకల ఆగడాలతో బెంబేలెత్తిన ప్రసన్నకుమార్ రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మ బెడ్ రూమ్‌లో తలుపులు వేసుకోగా వాటిని సైతం పగుల గొట్టారు. దీంతో భయాందోళనకు గురైన ఆమె బాత్ రూమ్‌లో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంది. పోర్టికోలో ఉన్న బెంజ్ కారును దుండగులు ధ్వంసం చేశారు.

విధ్వంసం వెనుక కుట్ర ఎవరిది ?

ఇప్పటికే రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో షాడో సీఎం లోకేశ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో సాగించిన పచ్చమూకల దాష్టీకం కుట్ర వెనుక కచ్చితంగా లోకేశ్ కుట్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలు, చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్న తీరుపై ఘాటుగానే విమర్శలు చేశారు. దీంతో ప్రసన్నకుమార్‌రెడ్డిని టార్గెట్ చేసిన లోకేశ్.. సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనలోనే విధ్వంస రచనకు ప్లాన్ గీశారని, ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన విమర్శలను అడ్డం పెట్టుకుని, ఆయన నెల్లూరు నుంచి వెళ్లిపోయిన తర్వాత టీడీపీ రౌడీ మూకలు ఈ దాడులకు పాల్పడ్డాయనే ఆరోపణలు ఉన్నాయి. అయితే విమర్శలకు బదులుగా వాదనలు గాకుండా, రౌడీ మూకల దాడులు చోటు చేసుకోవడం రాష్ట్రంలో ప్రజాస్వామ్య భావనకు గండి పడుతోంది. విమర్శలు చేసిన నేతల ఇంటిపైనే దాడులు చేయడం దారుణమని, రాజకీయ విమర్శలను ఎదుర్కొనే సంస్కృతి క్రమంగా అంతరించిపోతున్నదనే ఆందోళన వ్యక్తమవుతోంది.



పార్టీ నేతలతో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

తప్పుడు హామీలు.. బాబు మోసాలు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తప్పుడు హామీలతో ప్రజలను మభ్య పెట్టి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, చంద్రబాబు మోసాలపై 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్దామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని డీఆర్ ఉత్తమ్ హోటల్‌లో మంగళవారం ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చంద్రబాబు తీరు మారలేదన్నారు. ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరో అబద్ధం చెబుతూ ప్రజలను దగా చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో కరెంట్ బిల్లులు పెంచడం, కూటమి నేతలు సిండికేట్లుగా మారి ప్రజాధనాన్ని దోచుకుతినడం చూస్తున్నామన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరి స్మార్ట్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మోసపూరిత విధానాలను ఎండగడుతామన్నారు. 40 శాతం ఓటింగ్‌తో అత్యధిక జనాదరణ కలిగిన పార్టీగా వైఎస్సార్‌సీపీకి గుర్తింపు ఉందన్నారు. జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ క్యాడర్ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలకు స్వచ్ఛందంగా వస్తున్న ప్రజలను చూస్తున్న ప్రతి ఒక్కరికి ఈ విషయం అర్థమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలిచి చేస్తున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేక కూటమి నేతలు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలు అడ్డుకుంటున్నారన్నారు. ఇది ఎంతో కాలం చెల్లదని, కూటమి ప్రభుత్వానికి అర్థమయిందని, అందుకే జగన్మోహన్‌రెడ్డి పర్యటన అంటేనే భయపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకే వెంకటరెడ్డి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీమంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, కిలివేటి సంజీవయ్య, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఆనం విజయకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి, కాకాణి పూజిత తదితరులు హాజరయ్యారు.

దేవుడి దయతో బయట పడ్డా

- నన్ను అంతమొందించే కుట్ర ఇది
- 1961 నుంచి మా కుటుంబం రాజకీయాల్లో ఉంది
- జిల్లాలోని రాజకీయ కుటుంబాల్లో ఇలాంటి సంస్కృతి లేదు
- ఇలాంటి పరిణామాలు ప్రజాక్షేత్రంలో మంచిది కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న, చిత్రంలో పార్టీ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దేవుడి దయతోనే బయట పడ్డానని, నన్ను అంతమొందించే కుట్ర చేశారని మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. తమ కుటుంబం 1961 నుంచి రాజకీయాల్లో ఉందని, జిల్లాలోని రాజకీయ కుటుంబాల్లో ఇటువంటి సంప్రదాయం లేదన్నారు. సైద్ధాంతికంగానే తాము పోరాడామని గుర్తు చేశారు. మంగళవారం తన స్వగృహంలో ప్రసన్నకుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో తాను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కానీ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గాని వ్యక్తిగతంగా విమర్శించ లేదన్నారు. ఎన్నికల్లో విమర్శించుకున్నామని, విమర్శలు, ప్రతి విమర్శలు తప్పవన్నారు. ప్రశాంతిరెడ్డి గురించి తాను ఎక్కడ చెడ్డగా మాట్లాడలేదన్నారు. ఆమే తన గురించి చెడుగా మాట్లాడినా తాను పట్టించుకోలేదన్నారు. ఇటీవల ముదివర్తికి వెళ్లి నియోజకవర్గంలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఒక తట్టకూడా మట్టి వేయలేదని, అన్ని తానే చేయించానని చెప్పి ప్రగల్భాలు పలికిందన్నారు. తాను ఏదో సంపాదించుకున్నానని, అవినీతి పరుడినని వ్యక్తిగతంగా దాడి చేశారన్నారు.

ఆమె విమర్శలకు కౌంటర్ ఇచ్చానే కానీ..

సోమవారం కోవూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ విస్తత స్థాయి సమావేశంలో తాను ఇటీవల ఆమె మాట్లాడిన మాటలకు కౌంటర్ ఇచ్చానే కానీ, ప్రత్యేకంగా విమర్శలు చేయలేదని ప్రసన్న స్పష్టం చేశారు. నేనన్న మాటలు వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికీ కూడా ఆ మాటలకు కట్టుబడి ఉన్నానన్నారు. తాను చెప్పింది నూటికి నూరు శాతం నిజమన్నారు. మీకు దమ్ము, ధైర్యముంటే నీవు, ప్రభాకర్‌రెడ్డి రండి ప్రెస్‌మీట్ పెట్టండి.. విమర్శలు చేయండి. మళ్లీ మేము కౌంటర్ ఇచ్చుకుంటామన్నారు. ఏదో ఈవీఎంల ద్వారా ఎమ్మెల్యే అయిపోయి ఇలాంటి నీచ రాజకీయ సంస్కృతిని తీసుకురావడం గొప్పనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఇంట్లో తానుంటే చంపేసేవారని, ఆ దేవుడు తనను బయటకు పంపించాడన్నారు. ఈ రౌడీ మూకలు ఇల్లంతా ధ్వంసం చేశారని, 85 ఏళ్ల వయస్సులోని నా తల్లి ఇంట్లో ఉంటే ఆమెను బెదిరించారన్నారు. పనివాళ్లను ప్రాణభయానికి గురి చేశారన్నారు. ఇంటిని పగలగొట్టేశారు. బెడ్‌రూమ్, ఆఫీస్ సహా ధ్వంసం చేశారన్నారు.

రాజకీయంగా ఇలాంటివెప్పుడూ చూడలేదు

రాజకీయాల్లో ప్రత్యర్థులు విమర్శించడం సాధారణం. ఇలా ఇళ్లపై దాడులు జరగడం నేను ఇంత వరకు చూడలేదు. ఇన్నేళ్ల రాజకీయాల్లో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. ఇంట్లోకి చాలా మంది వచ్చారు. నన్ను మా వాచ్‌మెన్ రూమ్‌లో పెట్టాడు. అతన్ని బెదిరించారు. ఆమె ఎవరు అని అడిగితే పెద్దమ్మ అని చెప్పాడు. మా రూమ్‌లో కూడా వస్తువులు పగుల గొట్టారు. ఆమె ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇలా చేస్తుందనుకోలేదు.

– శ్రీలక్ష్మమ్మ, ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి





వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న అరుణమ్మ, మహిళా నేతలు తదితరులు



పార్టీ జిల్లా కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళలు, పార్టీ నేతలు

ఘనంగా 76వ జయంతి

మరణం లేని మహానేత వైఎస్సార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో మరణం లేని మహానేత అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కాకాణి పూజితతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి, పూజిత, జంకె వెంకటరెడ్డి, మహిళా నేతలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఆ మహానేత సేవలను స్మరించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, 108, 104 సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పక్కా ఇల్లు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను రాజశేఖరరెడ్డి పేద బడుగు బలహీనవర్గ ప్రజలకు అందించారని తెలిపారు. రాజశేఖరరెడ్డి అందించిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఆయన్ని దైవంగా కొలుస్తున్నారని తెలిపారు. రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, జిల్లా అనుబంధ సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గంధాన్ని తీసుకొస్తూ..


క్యూలైన్‌లో ఉన్న భక్తులు

స్వర్ణాల సంబరం

- రొట్టెల పండగకు మూడోరోజూ పోటెత్తిన భక్తులు
- దర్శనానికి గంటల కొద్దీ నిరీక్షణ

నెల్లూరు(బారకాసు): నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. బారాషహీద్‌లకు లేపనం చేసిన గంధాన్ని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం వరాల రొట్టెలు అందుకునేందుకు వచ్చిన వారితో స్వర్ణాల ఘాట్ కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మంగళవారం నెల్లూరులోని అన్ని రోడ్లు నిండిపోయాయి.

స్వర్ణాల ఘాట్లు కిటకిట

రొట్టెల పండగలో ముఖ్యమైన గంధ మహోత్సవం ముగియడంతో భక్తుల తాకిడి పెరిగింది. దర్గాలో బారాషహీద్‌లను దర్శించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. మూడోరోజు కూడా దర్గా ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖతో పాటు పలు కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు దర్గా ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాయి.

వరాల రొట్టెకు డిమాండ్

స్వర్ణాల తీరంలో పలు రొట్టెలకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా ఉద్యోగం, వివాహం, సంతాన రొట్టెల కోసం గంటల కొద్దీ భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. అధిక మంది ఆయా రొట్టెలను పట్టుకునేందుకు ఘాట్ వద్ద పోటీ పడ్డారు. అలాగే ధన, ప్రమోషన్, చదువు, సౌభాగ్య, విదేశీయాన తదితర రొట్టెలకు కూడా డిమాండ్ ఉంది.

ఆధ్యాత్మిక శోభ

నెల్లూరు(బృందావనం): మతసామరస్యానికి ప్రతీకగా సింహపురి వేదికగా జరుగుతున్న రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గా వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన బారాషహీద్‌ల గంధ మహోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. విద్యుద్దీప కాంతుల్లో దర్గా ప్రాంగణం శోభిల్లుతుంటే మరోవైపు బారాషహీద్‌ల దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువు కిటకిటలాడుతోంది. ప్రాంగణంలో ఏర్పాటైన వివిధ రకాల దుకాణాల వద్ద కోలాహలం నెలకొంది. ఐదురోజుల రొట్టెల పండగలో బుధవారం సంప్రదాయంగా బారాషహీద్‌లను స్మరిస్తూ 'తహలీల్ ఫాతేహా' (చదివింపులు) నిర్వహిస్తారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. గురువారం ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదు రోజులు పండగను జయప్రదం చేసిన అధికార యంత్రాంగానికి అభినందన కార్యక్రమం జరగనుంది.

జనసంద్రంగా మారిన స్వర్ణాల చెరువు



బారాషహీద్‌లను దర్శించుకుంటూ..


రొట్టె తినిపిస్తూ..

క్లుప్తంగా

ఆరోగ్య సమస్యలు తాళలేక..

- యువకుడి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): ఆరోగ్య సమస్యలు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. డ్రైవర్స్ కాలనీలో శైలజ, శివకోటాచారి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు మంజునాథ్ (25) కొయ్యపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను కొంతకాలంగా ఫిట్స్‌తో బాధ పడుతున్నాడు. చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. రెండు రోజుల క్రితం శైలజ, శివకోటాచారి చెన్నైలోని కుమార్తె ఇంటికెళ్లారు. మంజునాథ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సోమవారం జ్వరం కారణంగా అతను పనికి వెళ్లలేదు. శైలజ కుమారుడికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె పక్కింట్లో ఉంటున్న వినయ్‌కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. అతను ఇంటికి వెళ్లిచూడగా మంజునాథ్ బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉండటాన్ని గమనించాడు. ఈ విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలియజేశాడు. బాధిత తండ్రి శివకోటాచారి మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులను సంరక్షించి..


బాలుడిని అప్పగిస్తున్న ఏఎస్పీ, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ సందర్భంగా పోలీసు అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి భారీ బందోబస్తు నడుమ గంధ మహోత్సవం జరిగింది. కాగా తప్పిపోయిన 42 మంది చిన్నారులను పోలీసులు సంరక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్రైమ్ పార్టీ పోలీసులు ముగ్గురు జేబుదొంగల్ని అదుపులోకి తీసుకుని నగదు, బ్యాగ్‌లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. మంగళవారం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

నెల్లూరు కాలువలో మృతదేహం

నెల్లూరు సిటీ: నెల్లూరు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. రూరల్ మండల పరిధిలోని జొన్నవాడ కూడలి వద్ద నెల్లూరు కాలువలో సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడి వివరాలు లభ్యం కాలేదు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అతను ఆరురోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 31.397 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 31.397 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



బలవంతపు భూసేకరణను అడ్డుకుంటాం

- ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తోంది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కందుకూరు: కరేడు గ్రామ రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా బలవంతంగా భూములు లాక్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరేడు పరిధిలో 8,800 ఎకరాల భూములను తీసుకోవడంతోపాటు, 16 గ్రామాల ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. చట్ట ప్రకారం గ్రామసభ నిర్వహించి 80 శాతం మంది గ్రామస్తులు ఆమోదిస్తేనే భూసేకరణ చేయాలనే నిబంధన ఉన్నా కనీసం రైతుల అభిప్రాయాలకు విలువ ఇచ్చే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వంలో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండో సోలార్ కంపెనీకి గతంలో రావూరు, చేవూరు గ్రామాల పరిధిలో భూములు కేటాయించారని, అయినా కూడా ఆ పరిశ్రమను ప్రస్తుతం కరేడు వైపు మార్చడంలో ఉన్న ఉద్దేశం ఏంటో అర్థం కావడం లేదన్నారు. దొనకొండ, పామూరు వద్ద నిమ్జ్‌కు కేటాయించిన భూములు అనేకం ఉన్నాయని వాటిల్లో ఎందుకు ఏర్పాటు చేయకూడదని ప్రశ్నించారు.

పక్క రాష్ట్రాలకు చెందిన వారికే ఉద్యోగాలా?

పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రజలకు భ్రమ కల్పిస్తున్నారని, ఎటువంటి ఉద్యోగాలు రావడం లేదని శ్రీనివాసరావు అన్నారు. ఎక్కువ శాతం ఉద్యోగాలు పక్క రాష్ట్రాలకు చెందిన వారికే దక్కుతున్నాయని, భూములు కోల్పోతున్న వారికి రావడం లేదన్నారు. ఇప్పటికే ఇండో సోలార్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1,800 కోట్ల వరకు సబ్సిడీల రూపంలో వచ్చాయన్నారు. గతంలో కంపెనీ ఏర్పాటును వ్యతిరేకించిన టీడీపీ నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు

నేడు దేశవ్యాప్త సమ్మె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు బ్రోకర్లుగా మారి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని తీవ్రంగా శ్రీనివాసరావు విమర్శించారు.

కార్మికుల హక్కులను కాపాడేందుకు బుధవారం దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శివర్గ సభ్యుడు కె.అజయ్‌కుమార్, గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు ప్రాంతీయ కమిటీల కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, ఎస్‌ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి సందర్భంగా..


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

- నెల్లూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆ పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నాయకులు, యువజన విభాగం నేతలు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజా నాయకుడని చెప్పారు.

జేసీని కలిసిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

నెల్లూరు రూరల్: కేంద్రం నుంచి వచ్చిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జేసీ కె.కార్తీక్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. టీం లీడర్ సందీప్, నోడల్ అధికారి మాణికరావు, కో–ఆర్డినేటర్ ప్రేమలత, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ జి.రెడ్డయ్య, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్లు ఎం.శ్రీనయ్య, కె.అంజని, ఎం.వంశీకృష్ణలు కలిసి మాట్లాడారు. గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పద్ధతుల ఆధారంగా గ్రామాలను పరిశీలించి వాటికి ర్యాంక్‌లు కేటాయించనున్నట్లు తెలిపారు. పారిశుధ్యంపై అవగాహన పెంచడం, పౌరుల భాగస్వామ్యం పెరగడం, గ్రామ, పట్టణాల్లో పరిశుభ్రత ప్రమాణాలు మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం జేసీ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ టీం గ్రామాల్లో పర్యటించే సమయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇతర గ్రామ స్థాయి సిబ్బంది పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు.

కోర్టు వాయిదాలకు హాజరుకాని కేసులో రిమాండ్

ఉదయగిరి: మహిళపై లైంగికదాడికి యత్నించిన కేసులో ఉండి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. స్థానిక ఎస్సై ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. దుత్తలూరు మండలం నందిపాడు ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ బక్కా ప్రకాశ్ ఉదయగిరి మండలం కుర్రపల్లిలో 2014 సంవత్సరంలో ఓ మహిళపై లైంగికదాడికి యత్నించాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 2018 తర్వాత కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో కోర్టు నిందితుడికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పోలీసులు అతడి ఆచూకీ కోసం గాలించి మంగళవారం పట్టుకుని 8వ అదనపు జిల్లా కోర్టు ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రేషన్ షాపుల్లో బినామీల బాగోతం

- ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో 338 దుకాణాల నిర్వహణ
- బినామీల పేర్లతో ఏళ్ల తరబడి కొనసాగింపు
- తనిఖీల తర్వాత మారిపోతున్న డీలర్ల ఫొటోలు
- పట్టించుకోని అధికారులు





డీలర్ల ఫొటోలు మార్పు చేశారిలా..

నెల్లూరు(పొగతోట): చౌకదుకాణాల డీలర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. బినామీ పేర్లతో షాపులు నిర్వహిస్తూ పేదల బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. జిల్లాలో 1,513 చౌకదుకాణాలు న్నాయి. ప్రతినెలా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం కార్డుదారులకు అందజేస్తున్నారు. 7.21 లక్షల మంది కార్డుదారులున్నారు. 338 చౌకదుకాణాలు స్వయం, సహాయక గ్రూపు మహిళల ఆధ్వర్యంలో ఉన్నాయి. వీటిలో కొన్నింటిని బినామీ పేర్లతో మార్పులు చేసి సంవత్సరాల నుంచి డీలర్లు నిర్వహిస్తున్నారు. కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. చౌకదుకాణానికి సంబంధించి డీలర్ పేరు, ఐడీ మార్పు చేయాలంటే డీఎస్‌ఓ కార్యాలయం నుంచి ఫైల్ నిర్వహించాల్సి ఉంది. దీనికి సుమారు వారం నుంచి 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. డీలర్ల మహత్యం, నిమిషాల వ్యవధిలో ఐడీ, ఫొటో మార్పులు జరిగిపోతున్నాయి. గతవారంలో నెల్లూరులోని 50వ నంబర్ దుకాణంలో ఫిర్యాదులు రావడంతో ఏఎస్‌ఓ అంకయ్య తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో డీలర్ యశోధ అనే మహిళకు బదులు పురుషుడి ఫొటో ఉంది. తనిఖీ అనంతరం యశోధ ఫొటో ప్రత్యక్షమైంది. మరుసటి రోజు డీఎస్‌ఓ విజయ్‌కుమార్ తనిఖీలకు వెళ్లగా మహిళ ఫొటో ఆన్‌లైన్‌లో దర్శనమిచ్చింది. అదే విధంగా నగరంలో పది దుకాణాలకు సంబంధించి ఫొటోల మార్పులు జరిగినట్లు సమాచారం.

నిబంధనలతో పనిలేకుండా..

6 ఏ కేసు, ఇతర అక్రమాలకు పాల్పడిన డీలర్లను సస్పెండ్ చేసి ఆ దుకాణాన్ని స్వయం సహాయక గ్రూపు మహిళకు నిర్వహించేందుకు అప్పగిస్తారు. మూడు నెలలు మాత్రమే వారి ఆధ్వర్యంలో నిర్వహణకు అవకాశం ఉంది. నిబంధనలకు పాతరేసిన డీలర్లు సంవత్సరాల తరబడి ఆయా దుకాణాలను కొనసాగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డీలర్ ఐడీ, ఫొటో మార్పునకు సంబంధించి డీఎస్‌ఓ కార్యాలయం నుంచి ఫైల్ నిర్వహించి వాటికి డీఎస్‌ఓ, జాయింట్ కలెక్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఈప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్‌ఐసీ అధికారులు ఆన్‌లైన్‌లో ఐడీ, ఫొటో మార్పు చేయాల్సి ఉంది. నెల్లూరు డీలర్ల మాయాజాలం, కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటంతో నిమిషాల వ్యవధిలో అవి మారిపోతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

చౌకదుకాణాల్లో అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో డీలర్ల ఫొటో మార్పునకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు తెప్పించుకుంటాం. దానికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తాం. ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలకు ఆర్‌డీఓలు నోటిఫికేషన్ ఇచ్చి డీలర్లను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– విజయ్‌కుమార్, డీఎస్‌ఓ

13న స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి సుంకర మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ గుర్తింపుకార్డు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారు విశాఖపట్నంలో ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆయా తేదీల్లో ఎంపికలకు హాజరుకావాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఆత్మకూరు: కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలంలోని నువ్వూరుపాడులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎం.మోహన్‌రెడ్డి, సుజాత (34) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్టర్ వద్ద పనులు చేస్తుంటాడు. గ్రామంలో కొద్దిపాటి పొలంలో వ్యవసాయ చేస్తుంటాడు. సుజాతకు ఆరోగ్య సమస్యలున్నాయి. కొద్దిరోజులుగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. సుజాత సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆత్మకూరు, అనంతరం నెల్లూరు ఆస్పత్రుల్లో చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళవారం తిరుపతికి తీసుకెళ్తుండగా తరలిస్తుండగా మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాయిప్రసాద్ పేర్కొన్నారు.